సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



వేంకటేశ్వరునికి వెండి పాదుకలు


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఎం.రాజేష్‌కుమార్, సరళ లక్ష్మీ కుమారి (మొగల్తూరు) శనివారం 497 గ్రాముల వెండి పాదుకలు సమర్పించారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు జంప కుమార్ వినయ్‌బాబు (అనకాపల్లి) శనివారం రూ.51,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,130 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1,425, పశ్చిమ డెల్టాకు 3,740 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 8.20అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం సిటీ) : జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి శనివారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లులను విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు, సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో కూడా చెల్లించవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు నిధి అప్‌కే నికత్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగులు భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం నిధి అప్‌కే నికత్–డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం జరగనుంది. పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఈ విషయం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఖాతాదారులు ఈ సేవలు వినియోగించుకోవచ్చునన్నారు. భవిష్యనిధి అంతిమ ఉపసంహరణ, ఖాతాల బదిలీ తదితర అంశాలకు సంబంధించి పరిష్కరిస్తామన్నారు. రాజమహేంద్రవరం మోరంపూడి జంక్షన్‌లోని ఈపీఎఫ్‌వో కార్యాలయంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో యానాం మెస్సర్స్ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజ్మెంట్ రిసోర్స్‌సెంటర్‌లో, కాకినాడ జిల్లా పరిధిలో కాకినాడ మెస్సర్స్ ప్యారీషుగర్‌రిఫైనరీలో, ఏలూరుజిల్లాలో ఏలూరులోని జూట్‌మిల్‌వద్ద జిల్లా కార్యాలయంలో, పశ్చిమగోదావరిజిల్లా పరిధిలో భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు, ఆయా ప్రాంతాల్లో యూనివర్సల్ ఖాతా సంఖ్య (యుఎఎన్) సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

మోదీ సంస్కరణలతో మరింత అభివృద్ధి

కేంద్ర విదేశాంగ మంత్రి మురళీధరన్



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర విదేశాంగ మంత్రి మురళీధరన్

ప్రకాశం నగర్(రాజమహేంద్రవరం సిటీ): ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన సంస్కరణలతో దేశం మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్ర విదేశాంగ మంత్రి మురళీధరన్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ సీనియర్ నాయకుడు ఈ.శ్రీరామమూర్తి బీజేపీలో చేరారు. పార్టీ కండువా కప్పి శ్రీరామమూర్తిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు నేతగా వ్యవహరించిన శ్రీరామమూర్తి చేరికతో రాబోయే ఎన్నికల్లో మంచి ఫలితాలను రాబడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, పార్టీ నాయకులు రేలంగి శ్రీదేవి, కురగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్

నిడదవోలు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి 1న రానున్న నేపథ్యంలో కలెక్టర్ కె.మాధవీలత పట్టణంలోని సుబ్బరాజు పేట శివారులో హెలిప్యాడ్ స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కుమార్తె రిసెప్షన్‌కు సీఎం జగన్ హాజరు కానున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పల్లారావు, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, తహసీల్దార్ ఎస్.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయ్.. పూతరేకులండీ..

- ఆత్రేయపురానికి పేరు తెస్తున్న స్వీటు
- కాలానికి నిలబడి చెక్కుచెదరని వైనం
- రేకుల తయారీతో ఎంతోమంది మహిళలకు ఉపాధి
- త్వరలో జీఐ జర్నల్‌లోనూ దక్కనున్న స్థానం









ఆత్రేయపురం.. ఈ పేరు వినగానే తక్కున గుర్తుకు వచ్చేది పూతరేకు. ఈ పేరు వింటేనే నోరూరుతుంది. రుచిలో.. రూపంలో దీనికేదీ సాటి రాదు. ఆత్రేయపురంలో పుట్టి ఆ ప్రాంతానికి ఓ బ్రాండ్ ఇమేజిని తెచ్చిపెట్టింది అందుకే. వందేళ్లకు పైబడిన చరిత్రను సొంతం చేసుకున్న ఆత్రేయపురం పూతరేకులకు జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ (జీఐ) ఇచ్చేందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఇందుకోసం విశాఖలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వ విద్యాలయం సహకారంతో సర్ ఆర్థర్ కాటన్ పూతరేకుల సహకార సంఘం ఇప్పటికే దరఖాస్తు చేసింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం కాకపోతే మూడు నెలల్లోనే చెన్నైలోని జీఐ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఆత్రేయపురం పూతరేకులకు గుర్తింపు జారీ అవుతుంది. దీంతో ఇక్కడి ప్రజల చిరకాల కోరిక నెరవేరుతుంది.

– రాజమహేంద్రవరం డెస్క్

పూతరేకులకు స్ఫూర్తి

పూర్వం మైసూరుకు చెందిన ఒక మహిళ ఆత్రేయపురం కోడలిగా వచ్చింది. అప్పట్లో అన్నం వారుస్తుండగా వచ్చిన గంజి కుండపై పడి, రేకుగా వచ్చింది. దానిని చూసి విస్తుపోయిన ఆమె సరదాగా పంచదారతో కలిపి తిని ముచ్చట పడింది. అలా ఆవిర్భవించిందే పూతరేకు. తొలినాళ్లలో క్షత్రియ మహిళలు ఈ రేకు తయారు చేసి, పంచదార అద్దేవారు. కాలక్రమంలో ఇతర వర్గాల మహిళలు కూడా ఈ రేకు తయారీ నేర్చుకున్నారు. ఉపాధిగా మార్చుకున్నారు. ఒక్క ఆత్రేయపురంలోనే సుమారు 400 కుటుంబాలు పూతరేకుల తయారీపై ఆధారపడ్డాయి. ఇతర ప్రాంతాలతో కలుపుకొంటే రెండు వేల మందికి పైగా మహిళలు ఈ రేకుల తయారీలో ఆరితేరిపోయారు. మనం ఎక్కడ పూతరేకు తిన్నా ఆ రేకు ఆత్రేయపురానిదేనని ఘంటాపథంగా చెప్పొచ్చు.

కాలానుగుణంగా ఎన్ని సోకులో..

తొలినాళ్లలో ఒక్క పంచదారతోనే పూతరేకులు తయారు చేసేవారు. ఇవి తెల్లగా మెరిసిపోతూ.. నోట్లో పెట్టుకోగానే కరిగిపోయేవి. కాలానుగుణంగా మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఇందులోనూ అనేక రకాలు వచ్చేశాయి. బెల్లంతో తయారు చేస్తున్నారు. మధుమేహ బాధితుల కోసం షుగర్ ఫ్రీగా అమ్ముతున్నారు. కొందరు మరో అడుగు ముందుకేసి డ్రైఫ్రూట్స్‌నూ కలుపుతున్నారు. అసలు రుచి మారినా.. కొత్త రుచితో ఉన్న పూతరేకులను ఎక్కువ మంది ఆదరిస్తున్నారు. ఈ రుచులను ఆస్వాదిస్తున్నారు. స్వీట్స్ ప్రియులను ఆకట్టుకోవడానికి బోర్న్‌విటా, హార్లిక్స్ వంటివి చల్లుతూ కొత్త ఫ్లేవర్లు తయారు చేస్తున్నారు.

రేకుల వెనుక రెక్కల కష్టం

సాధారణంగా మనం స్వీట్‌స్టాల్‌లో పూతరేకుల ప్యాకెట్ రేటు అడగ్గానే కొంచెం ఎక్కువే ఉంటుంది. కానీ రేకుల తయారీదారుల మాటలు వింటే వారికి పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. గట్టిగా రోజంతా కష్టపడితే రూ.300 సంపాదిస్తున్నానని ఆత్రేయపురానికి చెందిన ఓ మహిళ చెప్పింది. మరికొందరు కూడా ఇదే తరహా ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వ్యాపారులు వీరికి కొద్దోగొప్పో రుణం ఇచ్చి, తక్కువ కూలికే రేకులు తయారు చేయించుకుంటున్న వైనాలూ ఉంటున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా తయారీ మహిళల నోట తీపి మాటలు మాత్రం వినిపించకపోవడం కొంత బాధ కలుగుతుంది. వీరందరినీ ఒక తాటి మీదకు తీసుకువస్తే మార్కెట్‌నూ శాసించగలుగుతారు. ఒకే తరహా రేటూ పొందగలుగుతారు.



భారీగానే వ్యాపారం

రోజూ సగటున లక్షల్లోనే పూతరేకుల వ్యాపారం జరుగుతోంది. మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా వీటిని విక్రయిస్తున్నారు. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఆలిఫ్ వెకార్డ్ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్‌లో ఆత్రేయపురం పూతరేకు అందరినీ ఆకట్టుకుంది.

ఏకతాటి మీదకు రావాలి



ఆత్రేయపురానికి విశిష్ట ఖ్యాతి ఆర్జించి పెడుతున్న పూతరేకుల తయారీలో మహిళలదే కీలక పాత్ర. ప్రస్తుతం అసంఘటితంగా ఉన్న వీరందరూ ఒకే తాటి పైకి రావాల్సిన అవసరముంది. నాణ్యత, మార్కెట్ విషయంలో ఏకాభిప్రాయానికి రావాలి. అప్పుడే వీరికి శ్రమకు తగ్గ ప్రతిఫలం వస్తుంది. తలోదారిలో తయారు చేసుకుంటూ పోతే మార్కెట్‌ను శాసించలేని పరిస్థితి ఉంటుంది. ఈ విషయంలో మార్పు రావాలి.

– గాదిరాజు ప్రసాదరాజు, ఆత్రేయపురం

ప్రోత్సాహం అందించాలి



చాలా కాలం నుంచి పూతరేకులు తయారు చేస్తున్నాం. మా ముందు తరాల నుంచీ ఇదే చేస్తున్నాం. పేద మహిళలు చాలా మంది రేకులు తయారు చేస్తున్నారు. సరైన కూలి కూడా రావడం లేదు. ఎంతో ఓపికగా చేయాల్సిన పని ఇది. బ్యాంకులు ముందుకొచ్చి రుణాలు మంజూరు చేయాలి. ప్రోత్సాహం అందించాలి.

– జి. నాగమణి, ఆత్రేయపురం

పూతరేకుల కబుర్లు

- దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి కోనసీమలో తయారైన పిండి వంటలతో పాటు ఆత్రేయపురం పూతరేకులను అప్పటి ప్రధాని వాజ్‌పేయ్‌కు రుచి చూపించారని ఇక్కడి ప్రజలు గర్వంగా చెబుతారు.
- ఆత్రేయపురం పూతరేకుల ఖ్యాతిని మరింత వ్యాప్తి చేసేలా తపాలా శాఖ గత ఏడాది ప్రత్యేక తపాలా కవరు విడుదల చేసింది.
- రాష్ట్ర పర్యాటక ప్రాధికార సంస్థ, భవానీ ల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) నేతృత్వంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డు కోసం 10 మీటర్ల పూతరేకు తయారు చేసింది. ఇది ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సంపాదించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. త్వరలో అధికారికంగా సర్టిఫికెట్ జారీ కానుంది.
- చాలా సినిమాల్లో పూతరేకుల ప్రస్తావన కనిపిస్తుంది. దిగ్గజ బాలీవుడ్ నటుడు అమ్రీష్‌పురీకి అత్యంత ఇష్టమైన వాటిలో పేపర్ స్వీట్ (పూతరేకును ఆయన ముద్దుగా పిలుచుకునే పేరు) ఒకటని చెబుతారు.

కొండపై షెడ్డుకు చేరిన బ్యాటరీ కార్లు



ప్రారంభంలోనే మరమ్మతులకు గురవడంతో కవరు కప్పి ఉంచిన బ్యాటరీ కారు



రెండు నెలలు భక్తుల రాకపోకలకు ఉపయోగపడి మరమ్మత్తులకు గురయిన కారు

మరమ్మత్తులు చేశాక ఉపయోగిస్తాం: ఈఓ

అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలో రెండు బ్యాటరీ కార్లు మరమ్మతులకు గురై షెడ్డుకు చేరాయి. రూ.26 లక్షలు విలువ చేసే రెండు బ్యాటరీ కార్లను గత నెల10న దేవస్థానానికి ఎస్‌బీఐ అందజేసింది. వృద్ధులు, వికలాంగులు, మహిళలను సత్రాల నుంచి స్వామివారి ఆలయానికి చేర్చడానికి..మరలా ఆలయం నుంచి సత్రాలకు చేర్చేందుకు ఈ వాహనాలను వినియోగించేవారు. వీటిలో ఒక కారు ప్రారంభంలోనే బ్రేక్ ఫెయిలయింది. సంబంధిత కంపెనీ వారికి సమస్య తెలియచేసి వాహనాన్ని నిలిపివేశారు. మిగిలిన కారునే రెండు నెలలుగా సీఆర్వో కార్యాలయం నుంచి పశ్చిమ రాజగోపురానికి, సత్యగిరికి నడిపారు. ఆ కారులో 14 మంది ఎక్కేవారు. ఈ కారు కూడా తాజాగా మరమ్మతులకు గురయింది. దీంతో ఈ వాహన సేవలు కూడా నిలిచిపోయాయి. బ్యాటరీ కారు సాధారణంగా సమతలంగా ఉన్న రోడ్ల మీద బాగా నడుస్తాయి. ఘాట్ రోడ్లులో సరిగా పనిచేయవని అంటున్నారు. ఘాట్‌రోడ్లు ఎక్కేటపుడు బ్యాటరీ పవర్ సరిపోక ఇంజిన్లు పాడవుతాయని తెలిసింది. గతంలో కూడా దేవస్థానం కొనుగోలు చేసిన బ్యాటరీ కారు ఇదే విధంగా పాడైంది. దానిని రిపేరు చేయించకుండా షెడ్డుకు తరలించి వదిలేశారు. ఇప్పుడు రెండు బ్యాటరీ కార్లు కూడా షెడ్డుకు చేరాయి. రెండు బ్యాటరీ కార్లలో సాంకేతికమైన సమస్యలు తలెత్తాయని స్టేట్‌బ్యాంక్ అధికారులకు తెలియచేశామని ఈఓ సత్యనారాయణ మూర్తి చెప్పారు. మరమ్మతులు చేయిస్తామని ఆ సంస్థ అధికారులు తెలిపారన్నారు.

విధుల నుంచి వ్రత విభాగ స్టోర్ కీపర్ తొలగింపు



ఈఓ సత్యనారాయణ మూర్తి

అన్నవరంలోని సత్యనారాయణ స్వామి దేవస్థానంలో వ్రతాల విభాగంలో ఒకరిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. పూజాద్రవ్యాల వినియోగంలో అవకతవకలు జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో వ్రతాల స్టోర్స్ సూపర్‌వైజర్ కర్రి సూర్యనారాయణ మూర్తిపై ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఈఓ సత్యనారాయణ మూర్తి శనివారం తెలిపారు. రూ.పది వేలు జరిమానా కూడా విధించామన్నారు. వ్రత గావంచా మీద వేసే బియ్యం, దీపం వెలిగించే నూనె, అగరవత్తులు, హారతి కర్పూరం, కలశం మీద పెట్టే జాకెట్ వస్త్రం తదితర సామగ్రి భక్తులకు దిట్టం ప్రకారం అందచేయడం లేదనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆలయ సూపరింటెండెంట్ ఐవీ రామారావు విచారించి ఇటీవల నివేదిక అందచేశారు. వ్రతాల కౌంటర్‌లో వ్రతం టిక్కెట్ల విషయంలో అక్కడ ఉద్యోగిని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వ్రతాల విభాగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని ఈఓ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఇందుకు రాబోయే రోజుల్లో కసరత్తు మొదలు పెడతామన్నారు.

దూసుకువచ్చిన మృత్యువు

- లారీ ఢీకొని మహిళ మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- దైవ దర్శనానికి వెళ్తుండగా దుర్ఘటన

పిఠాపురం: దైవ దర్శనానికి వెళ్తున్న భక్తబృందంపై లారీ దూసుకుపోవడంతో ఒక మహిళ దుర్మరణం పాలైంది. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన గాజుల వరలక్ష్మి, గాజుల శివగంగ (25), మరో నలుగురు కలిసి శనివారం తెల్లవారుజామున పెద్దాపురం మండలం చిన తిరుపతి గ్రామంలో వేంచేసిన శృంగారవల్లభస్వామి వారి దర్శనానికి కాలి నడకన బయలుదేరారు. 216 జాతీయ రహదారిపై గొల్లప్రోలు వై జంక్షన్ వద్ద కత్తిపూడి నుంచి కాకినాడ వెళ్తున్న గుర్తు తెలియని లారీ అతి వేగంగా దూసుకువచ్చి, వరలక్ష్మి, శివగంగలను బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలతో శివగంగ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన వరలక్ష్మిని హైవే మొబైల్ పోలీసులు 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం శివగంగ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలు శివగంగకు భర్త ఉన్నాడు. ఈ ప్రమాదంతో చేబ్రోలులో విషాద ఛాయలు అలముకున్నాయి.


సంఘటన స్థలంలో పడి ఉన్న మహిళలు

క్లుప్తంగా

పాఠశాల పైనుంచి పడి విద్యార్థి మృతి


మహేంద్ర (పాతచిత్రం)

కొత్తపల్లి: పాఠశాల భవనం పైనుంచి ప్రమాదవశాత్తూ పడి, ఒక విద్యార్థి మృతి చెందిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. ఉప్పాడ శివారు కొత్తపట్నానికి చెందిన మైల భూలోక కుమారుడు మహేంద్ర (12) కొత్తపల్లి జెడ్పీ హైస్కూలులో 6వ తరగతి చదువుతున్నాడు. అనారోగ్యంగా ఉండటంతో రెండు రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదు. శుక్రవారం సాయంత్రం ఇంటి దగ్గరలోని ప్రాథమిక పాఠశాల భవనం ఎక్కి ఆడుకుంటూండగా ప్రమాదశాత్తూ కింద పడి, తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తీసుకువెళుతూండగా మహేంద్ర మార్గం మధ్యలోనే మృతి చెందాడు. దీనిపై తమకు ఎటువంటి సమాచారమూ లేదని కొత్తపల్లి పోలీసులు చెప్పారు.

కారును తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా

- ఒకరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: పంట కాలువలో ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్, స్థానికుల కథనం ప్రకారం.. కె.గంగవరం మండలం కూళ్ల గ్రామం నుంచి ఇటుకల లోడు ట్రాక్టర్ గోదావరి ఏటిగట్టు రహదారిలో యానాం వస్తోంది. తాళ్లరేవు మండలం గోవలంక ఇసుక ర్యాంపు సమీపానికి వచ్చేసరికి ఎదురుగా కారు వస్తోంది. దానిని తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న పంట కాలువలో బోల్తా పడింది. సుమారు 15 అడుగుల లోతులో పడటంతో ఇటుకల కింద పడి కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామానికి చెందిన తొత్తరమూడి ప్రసాద్ (34) మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కోటిపల్లికి చెందిన మోర్త ప్రసన్నకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన ఇటుకల లోడు ట్రాక్టర్

జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ ఫైనల్స్ నేడు


హర్యానా - మహారాష్ట్ర జట్ల మధ్య మ్యాచ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల ఫైనల్స్ ఆదివారం నిర్వహించనున్నారు. శనివారం నిర్వహించిన సెమీఫైనల్స్‌లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. టోర్నమెంట్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఒడిశా, జార్ఖండ్ నిరాశతో వెనుతిరిగాయి. మొదటి సెమీ ఫైనల్స్‌లో హర్యానా - మహారాష్ట్ర జట్లు పోటీ పడ్డాయి. 1-1 స్కోర్‌తో టైబ్రేకర్ కాగా పెనాల్టీ షూట్స్‌లో మహారాష్ట్ర గోల్ చేసింది. హర్యాణా గోల్ చేయలేకపోవడంతో 2-0 స్కోర్‌తో మహారాష్ట్ర ఫైనల్స్‌కు చేరింది. డబుల్ ఒలింపియన్, ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్యగీత చేతుల మీదుగా ప్లేయర్ ఆఫ్ ది అవార్డును భావన కడ అందుకుంది. మహారాష్ట్ర జట్టుకు క్వార్టర్ ఫైనల్స్‌లో కూడా టైబ్రేకర్ కలసి రావడం విశేషం. రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్, జార్ఖండ్ జట్లు పోటీ పడ్డాయి. మధ్యప్రదేశ్ 2-0 స్కోర్‌తో విజయం సాధించి, ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కరిష్మా యాదవ్ అందుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్‌రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారి పీటర్, టోర్నమెంట్ కో ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.

రూ.8.98 లక్షల ఎరువుల సీజ్

మామిడికుదురు: స్థానిక శ్రీజయలక్ష్మి ఫెర్టిలైజర్స్ షాపుపై రాజమహేంద్రవరానికి చెందిన విజిలెన్స్ అధికారులు శనివారం దాడి చేశారు. 662 బస్తాల యూరియా, 425 బస్తాల పొటాష్ ఎరువులను సీజ్ చేశారు. రూ.8.98 లక్షలు విలువైన 51.04 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. ముందుగా రైతుల పేరు చెప్పి షాపునకు వచ్చిన అధికారులు.. యూరియా ధర ఎంతని ఆరా తీశారు. రూ.266.50కు అమ్మాల్సిన యూరియా బస్తాను రూ.290కి విక్రయిస్తున్నట్టు నిర్ధారణకు వచ్చారు. దీనిపై లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కుటుంబరావు కేసు నమోదు చేశారు. అనంతరం షాపు రికార్డులు పరిశీలించగా, వాస్తవంగా ఉన్న స్టాకుకు, రిజిస్టర్‌లో ఉన్న వివరాలకు మధ్య తేడా ఉందని గుర్తించి, 6ఎ కేసు నమోదు చేశారు. ఈ దాడిలో మండల వ్యవసాయాధికారి బి.మృదుల, విజిలెన్స్ తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు.


ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గోకవరంలో..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లా గోకవరంలోని శ్రీ అనంత అగ్రో ఏజెన్సీస్ ఎరువుల దుకాణాన్ని కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇక్కడ కూడా ఎరువులను గరిష్ట అమ్మకపు ధరకు మించి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఇక్కడ సుమారు రూ.86,879 విలువైన 14.67 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశారు. ఇక్కడ భారత్ యూరియా గరిష్ట అమ్మకపు ధర రూ.266.50 ఉండగా రూ.280కి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. దీంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఈ వివరాలను రైల్వే పోలీసు అధికారి పి.విజయ్‌శంకర్ మీడియాకు వెల్లడించారు. విజయవాడకు చెందిన యనమల శ్రీనివాసరెడ్డి గత నెల 14న తిరుమల ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆయన మొబైల్‌ను దొంగిలించారు. దీనిపై నాగేశ్వరరావు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు కోటగుమ్మం ప్రాంతానికి చెందిన పాడుగు గణేష్‌ను, మరో ఇద్దరు బాల నేరస్తులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల విలువైన 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని విజయవాడ రైల్వే మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. ఇద్దరు మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్సైలు పి.లోవరాజు, కె.మావుళ్లు, సైదయ్య, సిబ్బందిని అధికారులు అభినందించారు.


సెల్‌ఫోన్ దొంగను అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

5 కాసుల బంగారం చోరీ

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లిలో తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోరాడ సుబ్రహ్మణ్యశర్మ ఈ నెల 19న తన ఇంటికి తాళాలు వేసి, నిడదవోలులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఆయన ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని పక్కనే నివసిస్తున్న లక్ష్మణశర్మ శుక్రవారం గమనించారు. ఆయన ఇచ్చిన సమాచారంతో సుబ్రహ్మణ్యశర్మ వెంటనే ఇంటికి తిరిగివచ్చారు. ఐదు కాసుల బంగారు నగలు, రూ.10 వేల నగదును దొంగలు చోరీ చేసినట్టు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.గంగాభవాని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో రిమాండ్ ఖైదీ మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ కన్నోజి రాజబాబు (34) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. జైలు సూపరింటెండెంట్ ఎస్.రాజారావు కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలకు చెందిన రాజబాబును వై.రామవరం పోలీసులు గంజాయి కేసులో గత ఏడాది అక్టోబర్ 10న అరెస్టు చేశారు. అప్పటి నుంచీ అతడు రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నాడు. ఆయాసంగా ఉంటోందని చెప్పడంతో జైలు అధికారులు ఈ నెల 23న అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజబాబు గుండెపోటుతో మృతి చెందాడు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నేడూ అవకాశం

ముమ్మిడివరం: ఉమ్మడి గోదావరి జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించే వీలును అధికారులు కల్పించారు. ఈపీడీసీఎల్ ఎస్‌ఈ టీవీఎస్ఎన్ మూర్తి శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఈపీడీసీఎల్ సెక్షన్ కార్యాలయాల కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో బిల్లులు చెల్లించవచ్చని వివరించారు.

ఉపాధ్యాయులు తీరు మార్చుకోవాలి

గోపాలపురం: ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాలని, విద్యార్థులపై అశ్రద్ధ చూపుతున్న వారు తీరు మార్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎస్.అబ్రహం అన్నారు. గోపాలపురం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, సాగిపాడు గ్రామాల్లోని పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోపాలపురం ఉన్నత పాఠశాలలో ఇద్దరు, కొవ్వూరుపాడు ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడి తీరు బాగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మెమోలు జారీ చేశారు. విద్యార్థుల చదువుల విషయంలో ఉపాధ్యాయులు సిలబస్ ప్రకారం అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు.


గుడ్డిగూడెం పాఠశాలలోడీఈఓ అబ్రహం